WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epaperteluguJyothidaily.com
PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

జాతీయ దిన పత్రిక
అనుక్షణం జనం కోసం

విలేఖర్లు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు నియోజకవర్గాలు మండలాల వారీగా తెలుగుజ్యోతి జాతీయ దినపత్రిక కు రిపోర్టర్లు కావలెను
ఎటువంటి యాడ్ టార్గెట్లు లేవు, క్యాలెండర్ టార్గెట్లు లేవు,
9700959506
www.telugujyothinews. com

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA

సంపుటి:01 సంచిక:237 ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ పేజీలు:04 తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మంగళవారం 20-01-2026 వెల రూ.4.00

## 2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన

### కీరవాణిని అభినందించిన బండి సంజయ్

- వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే పరేడ్ ప్రత్యేక ప్రదర్శన
- సంగీతం అందిస్తున్న ఎం.ఎం. కీరవాణి
- దేశవ్యాప్తంగా 2500 మంది కళాకారులతో భారీ కార్యక్రమం
- కీరవాణి కృషిని కొనియాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహణ



**తెలుగు జ్యోతి ,హైదరాబాద్**

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణికి కేంద్ర సహాయ మంత్రి

## గ్రీన్ లాండ్ స్వాధీనంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- ఇరవై ఏళ్లుగా చెబుతున్నాం.. ఇప్పుడు టైమొచ్చిందన్న ట్రంప్
- తమ సూచనలను డెన్మార్క్ పెడచెవిన పెట్టిందని విమర్శ
- ఇన్నాళ్లుగా వేచి చూశాం.. ఇక తమ నియంత్రణలోకి తీసుకుంటామని వ్యాఖ్య



## అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఏలేటి మహేశ్వరరెడ్డి
- మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు
- వచ్చే నెల 6కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



## మేడారంలో ఆధునికీకరించిన గద్దెలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

పైలాన్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు పూజలు చేసిన ముఖ్యమంత్రి

మేడారం గుడిని రూ.251 కోట్లతో అభివృద్ధి చేసిన వైనం



**తెలుగు జ్యోతి ,మేడారం**

మేడారంలో ఆధునికీకరించిన గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అభివృద్ధి పనుల పైలాన్ ను ఆవిష్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో

# దూసుకెళ్తున్న సైబర్ మిత్ర




నిమిషాల్లోనే ఎఫ్ఐఆర్, వారంలో వెయ్యి మంది బాధితులకు ఫోన్

సైబర్ నేరాల కేసుల్లో బాధితులకు త్వరిత న్యాయానికి చర్యలు

బాధితులకు త్వరిత న్యాయం కోసం హైదరాబాద్ పోలీసుల వినూత్న కార్యక్రమం

పది రోజుల్లో వెయ్యి మంది బాధితులకు సీ-మిత్ర భరోసా

**తెలుగు జ్యోతి ,హైదరాబాద్**

సైబర్ నేరాల్లో చిక్కుకున్న బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు హైదరాబాద్ పోలీసులు చేపట్టిన వినూత్న కార్యక్రమం 'సీ–మిత్ర' (సైబర్ మిత్ర) సత్ఫలితాలను ఇస్తోంది. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ విధానం అమల్లోకి వచ్చిన కేవలం పది రోజుల్లోనే వందల మందికి భరోసానిచ్చింది. ఈ స్వల్ప వ్యవధిలో సీ–మిత్ర బృందం 1000 మంది బాధితులకు స్వయంగా ఫోన్ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. రోజుకు సగటున 100 ఫోన్ కాల్స్ చేస్తున్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 200 మందికి పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్ట్‌లను సిద్ధం చేసి పంపింది. వారి నుంచి సంతకం చేసిన ప్రతులు అందగానే ఎక్కడా జాప్యం లేకుండా 100కి పైగా ఎఫ్ఐఆర్లను నమోదు చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

### మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు


- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- ఈ నెల 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు కాల్పులు
- మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు



## వైసీపీని చిత్తుగా ఓడిస్తాం

### ఎంపీ అప్పలనాయుడు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఘోర ఓటమి తప్పదన్న అప్పలనాయుడు
- ఐదేళ్లలో జగన్ చేయలేదని 16 నెలల్లో చంద్రబాబు చేశారని వ్యాఖ్య
- చంద్రబాబుపై వైసీపీ, బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపాటు



## రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులతో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం

జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు

రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులతో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ

ఎన్నికల విజయంలో ఎన్నార్టీలు, జనసేన, బీజేపీల పాత్ర కీలకమని వెల్లడి

టెక్నాలజీ, యువతకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, ఏఎం గ్రీన్ వంటి భారీ పెట్టుబడులు సాధించామని వెల్లడి



**తెలుగు జ్యోతి,స్విట్జర్లాండ్**

స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు జ్యూరిచ్‌లో జరిగిన తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి పునర్నిర్మిస్తున్నామని, రాబోయే రోజుల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులతో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ప్రభావం చూపగల కమ్యూనిటీగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఒకప్పుడు నేను దావోస్‌కు వచ్చినప్పుడు భారతీయులే తక్కువగా

## తెలంగాణ నేతన్నలపై కేంద్రానిది రాజకీయ కక్షే

సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తోంది

వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు

ఈ విషయంపై కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కి కేటీఆర్ లేఖ

**తెలుగు జ్యోతి ,హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా జాప్యం చేస్తోందని, వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఈ విషయంపై కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కి కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. సిరిసిల్లలో 'మెగా పవర్ లూమ్ క్లస్టర్' ఏర్పాటు చేయాలనే డిమాండ్ నిన్న, మొన్నటిది కాదని, గత పదేళ్లుగా దీనిపై తాము నిరంతరాయంగా పోరాడుతున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. గతంలో మంత్రిగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, సిరిసిల్లా శాసన సభ్యుడిగా కేంద్రానికి అనేక విజ్ఞప్తులు చేశానని తెలిపారు. అయితే ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల నిర్ణయానికి రాకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

**సిరిసిల్లకు అన్ని అర్హతలు..**



సిరిసిల్ల క్లస్టర్ ఏర్పాటు కోసం గత పదేళ్లలో సుమారు పదిసార్లు కేంద్ర మంత్రులను స్వయంగా కలిసి మెగా పవర్ లూం క్లస్టర్ కోసం నివేదికలు, వినతులు ఇచ్చామని గుర్తు చేశారు. అరుణ్ జైట్లీ, స్మృతి ఇరానీ మొదలుకొని నేటి మంత్రి వరకు ప్రతి ఒక్కరినీ బతిమిలాడామని ప్రస్తావించారు. సీపీసీడీఎస్ నిబంధనల ప్రకారం సిరిసిల్లకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర బృందాలే ధ్రువీకరించినా, ఫైళ్లను పక్కన పెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటి? అని ప్రశ్నించారు.

ALL ARE CONTINUE 2 PAGE

# 2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన

మొదటి పేజీ రువాయి

బండి సంజయ్ అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కీరవాణి స్వరాలు సమకూర్చడం ఒక చరిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2,500 మంది కళాకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడం నిజంగా అద్భుతమని బండి సంజయ్ కొనియాడారు. సంగీతం, జాతీయ స్ఫూర్తి, ప్రతిష్ఠ అన్నీ కలగలిసిన ఈ కార్యక్రమం దేశానికి ఒక చారిత్రక నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, దీనికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు.ఈ అరుదైన అవకాశంపై కీరవాణి కూడా స్పందించారు. "వందేమాతరం! చరిత్రాత్మక గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్?కు సంగీతం సమకూర్చే గౌరవం నాకు దక్కింది. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ స్ఫూర్తిని చాటే ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి" అని ఆయన తన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ అపురూప ఘట్టం కోసం దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# గ్రీన్ లాండ్ స్వాధీనంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ రువాయి

గ్రీన్ లాండ్ విషయంలో గడిచిన ఇరవై సంవత్సరాలుగా డెన్మార్క్ ను నాటో హెచ్చరిస్తూనే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని చెబుతున్నా డెన్మార్క్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇరవై ఏళ్లుగా తాము వేచి చూస్తూనే ఉన్నామని చెబుతూ.. ఇప్పుడు తగిన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చిందని అన్నారు.గ్రీన్ లాండ్ స్వాధీనం విషయంలో తన వైఖరిని సమర్థించుకుంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. గ్రీన్ లాండ్ ను తమ నియంత్రణలోకి తెచ్చుకోవడం ఖాయమని ఆయన తేల్చిచెప్పారు. రష్యాను ఎదుర్కోవడంలో డెన్మార్క్ విఫలం కావడంతో భద్రతా కారణాల దృష్ట్యా తాము ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సమయం వచ్చింది కాబట్టే ఈ విషయంలో తాము కల్పించుకున్నామన్నారు.ఎలాగైనా గ్రీన్‌లాండ్ ను స్వాధీనం చేసుకుంటామంటూ ఆదివారం ట్రూత్ సోషల్ లో పోస్ట్ పెట్టారు. కాగా, ఈ విషయంలో తమ వైఖరిని వ్యతిరేకించే దేశాలపై టారిఫ్ లు విధిస్తామని హెచ్చరించిన ట్రంప్.. అన్నట్లుగానే ఈయూ కూటమిలోని 8 దేశాలపై 10 శాతం టారిఫ్ లు విధించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ టారిఫ్ లు అమలులోకి వస్తాయని ట్రంప్ స్పష్టం చేశారు.

# రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులతో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం

మొదటి పేజీ రువాయి

ఉండేవారు, తెలుగువారు అసలు కనిపించేవారు కాదు. కానీ ఇప్పుడు ఇక్కడ 20 దేశాల నుంచి వచ్చిన తెలుగువారిని చూస్తుంటే విజయవాడలో ఉన్నామా, తిరుపతిలో ఉన్నామా అనేంత సంతోషంగా ఉంది" అని అన్నారు. విదేశాల్లో ఉన్నా మన సంప్రదాయాలను పాటిస్తున్నారని, కోడిపందాలు తప్ప సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారని ప్రశంసించారు. తాను గతంలో విజన్ 2020, ఐటీ గురించి మాట్లాడినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఆనాటి నిర్ణయాల వల్లే నేడు తెలుగువారు 195 దేశాలకు వెళ్లగలిగారని గుర్తుచేశారు.ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నార్టీల పాత్ర అద్భుతమని కొనియాడారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే సదుద్దేశంతో పవన్ కల్యాణ్, బీజేపీ కలిసి వచ్చాయని తెలిపారు. "రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరగానే, ఎన్నార్టీలు ఆలోచించకుండా తరలివచ్చి కూటమి కోసం పనిచేశారు. కొందరు కార్యకర్తలతో సమానంగా కేసులు కూడా ఎదుర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు, మీ అందరి సహకారంతో 93 శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుత విజయం సాధించాం," అని చంద్రబాబు వివరించారు.విధ్వంసమైన రాష్ట్రాన్ని 18 నెలల కాలంలోనే తిరిగి గాడిన పెట్టామని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో బ్రాండ్‌ను పునరుద్ధరించామని చెప్పారు. అభివృద్ధి విషయంలో మంత్రులతో తాను పోటీ పడుతూ పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించామన్నారు. ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1 లక్ష కోట్లతో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తోందని, ఏఎం గ్రీన్ సంస్థ 10 బిలియన్ డాలర్లతో కాకినాడలో గ్రీన్ అమోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. దేశంలోకి వచ్చిన అతిపెద్ద పెట్టుబడి గూగుల్ రూపంలో ఏపీకే వచ్చిందన్నారు.యువతను ప్రోత్సహించడంలో భాగంగానే లోకేష్, రామ్మోహన్‌నాయుడు, టీజీ భరత్ వంటి వారికి పదవులు ఇచ్చామని తెలిపారు. రామ్మోహన్‌నాయుడు కేంద్రంలోనే అత్యంత పిన్నవయస్కుడైన కేబినెట్ మంత్రి కావడం గర్వకారణమన్నారు. "పదవులు వస్తే గ్లామరే కాదు, రాళ్లు కూడా పడతాయి. సవాళ్లను ఎదుర్కోవడం యువత నేర్చుకోవాలి" అని హితవు పలికారు. టెక్నాలజీ ప్రాధాన్యతను వివరిస్తూ లైచెన్ స్టెయిన్ అనే చిన్న దేశం టెక్నాలజీతోనే సంపన్న దేశంగా మారిందని, అందుకే తాము కూడా క్వాంటం, ఏఐ, స్పేస్, డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నామని తెలిపారు. డ్రోన్ ఆపరేషన్లకు అనుమతులు వేగవంతం చేసే బాధ్యతను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తీసుకోవాలని కోరారు. ఎలక్ట్రానిక్స్, హెల్త్ డివైసెస్, ఫార్మా, ప్రకృతి సేద్యం, నీటి భద్రత వంటి రంగాలపై దృష్టి సారించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

# మేడారంలో ఆధునికీకరించిన గద్దెలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ రువాయి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.త్వరలో జరగనున్న మేడారం మహా జాతర నేపథ్యంలో ప్రభుత్వం రూ.251 కోట్లతో ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులు చేసిన విషయం తెలిసిందే.

దావోస్ కు బయల్దేరిన రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు బయలుదేరారు. ఈ ఉదయం మేడారం వనదేవతల దర్శనం పూర్తి చేసుకున్న రేవంత్ రెడ్డి... అక్కడి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయల్దేరారు. ఐదు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో రేవంత్ రెడ్డి అంతర్జాతీయ స్థాయి సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను వివరించనున్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. తెలంగాణలో మౌలిక వసతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, వ్యాపారానికి అనుకూల వాతావరణాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్లకు వివరించనున్నారు.ఈ పర్యటనలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు కూడా పాల్గొననున్నారు. మేడారం అమ్మవార్ల ఆశీస్సులతో ప్రారంభమైన ఈ విదేశీ పర్యటన తెలంగాణకు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకువస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# వైసీపీని చిత్తుగా ఓడిస్తాం

మొదటి పేజీ రువాయి

ఏపీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాజయం తప్పదని విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జోస్యం చెప్పారు. వార్డ్ మెంబర్ నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని, వైసీపీని చిత్తుగా ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు.జగన్ ఐదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం 16 నెలల్లోనే చేసి చూపించారని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు చంద్రబాబుకు రెండు కళ్లు లాంటివని, తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని తెలిపారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయాలా? వద్దా? అనే విషయంపై పార్టీ అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందని అప్పలనాయుడు చెప్పారు.

# తెలంగాణ నేతన్నలపై కేంద్రానిది రాజకీయ కక్షే

మొదటి పేజీ రువాయి

తెలంగాణ అంటే కేంద్రానికి ఎందుకంత కక్ష? అని ప్రశ్నించారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదని, తెలంగాణ అభివృద్ధిని, ముఖ్యంగా ఇక్కడి నేతన్నలపై కేంద్రం చూపుతున్న వివక్షనేనని ధ్వజమెత్తారు. సిరిసిల్ల తెలంగాణ వస్త్ర పరిశ్రమకు గుండెకాయని కేటీఆర్ పేర్కొన్నారు. అక్కడ 30 వేలకు పైగా పవర్ లూమ్స్ కలిగి ఉండి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్ల కంటే తక్కువ సామర్థ్యం, తక్కువ కార్మిక శక్తి ఉన్న ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతాలకు మెగా క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్రం, అన్ని అర్హతలు ఉన్న సిరిసిల్లను పక్కన పెట్టడం ప్రాంతీయ వివక్షకు పరాకాష్టమని ఆరోపించారు. సిరిసిల్లకు మెగా క్లస్టర్ రాకపోవడానికి కారణం మెరిట్ లేకపోవడం కాదని, కేంద్రానికి తెలంగాణపై ఉన్న కక్షేనని కేటీఆర్ విమర్శించారు.

పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటు..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మెగా క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, నిరంతర విద్యుత్, నీరు, సింగిల్ విండో అనుమతులు, రాష్ట్ర స్థాయి ప్రోత్సాహకాలు.. ఇలా ప్రతి ఒక్క అర్హతను పూర్తి చేసిందని వివరించారు. ఇవన్నీ సిద్ధంగా ఉన్నాయని పదేపదే చెబుతున్నా, ఎటువంటి సాంకేతిక లేదా ఆర్థిక కారణాలు చూపకుండా కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు. ఒకవైపు 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం, దేశంలోనే అత్యంత సామర్థ్యం కలిగిన సిరిసిల్ల వంటి వస్త్ర పరిశ్రమ కేంద్రానికి మద్దతు ఇవ్వకపోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ద్వంద నీతికి, చిత్తశుద్ధిలేని తనానికి అద్దంపడుతోందని ఆక్షేపించారు. బీజేపీ ప్రభుత్వం కేవలం నినాదాలకే పరిమితం అయిందని విమర్శించారు. కేంద్రం చేస్తున్న ఈ జాప్యంతో సిరిసిల్లా నేతన్నలు భారీ మూల్యం చెల్లించుకుంటున్నారని పేర్కొన్నారు.

సంక్షోభంలో చేనేత రంగం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ విమర్శించారు. మళ్లీ ఆత్మహత్యల వార్తలు వినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలకు అండగా నిలిచిందని.. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. ఇటువంటి కీలక సమయంలో కేంద్రం జోక్యం చేసుకుని మెగా క్లస్టర్‌ను మంజూరు చేయాల్సి ఉండగా, తీవ్రమైన జాప్యం చేయడం నేతన్నల పొట్ట కొట్టడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ ఎంపీలు, కేంద్రమంత్రుల వైఫల్యం..

సమాఖ్య ప్రజాస్వామ్యంలో అభివృద్ధి అనేది రాజకీయ ప్రయోజనాల అధారంగానో లేక తాము అధికారంలో ఉన్న ఎంపిక చేసిన రాష్ట్రాలకే పరిమితం కాకూడదని పేర్కొన్నారు. బీజేపీ కేవలం తాము రాష్ట్రంలో అధికారంలో లేమనే కారణంతో తెలంగాణను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన ప్రజల్లో బలంగా ఉందని తెలిపారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా, కేంద్ర మంత్రివర్గంలో చోటు ఉన్నా.. సిరిసిల్ల నేతన్నల గోడును వినిపించడంలో వారు విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కేవలం ఉత్సవ విగ్రహాల్లా మారారని విమర్శలు చేశారు. బీజేపీ నాయకులు కేవలం ఓట్ల కోసమే తెలంగాణను వాడుకుంటున్నారు తప్ప, నిధుల సాధనలో చేతులెత్తేశారని ధ్వజమెత్తారు.

సానుకూల నిర్ణయం తీసుకోవాలి..

వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనైనా సిరిసిల్ల 'మెగా పవర్ లూమ్ క్లస్టర్'ను అధికారికంగా ప్రకటించి, ఈ పదేళ్ల అన్యాయానికి ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా, సహకార సమాఖ్య స్ఫూర్తితో తెలంగాణ నేతన్నల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాలని కేటీఆర్ కోరారు. కేంద్రం జాప్యం పెరిగే కొద్దీ నేతన్నలలో ఆవేదన ఆగ్రహంగా మారుతోందని, తక్షణమే కేంద్రమంత్రి వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని కేటీఆర్ తన లేఖలో కోరారు.

# అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

మొదటి పేజీ రువాయి

సుప్రీంకోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్‌పై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయలేదని పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను కౌశిక్ రెడ్డి, కేటీఆర్ పిటిషన్లతో జత చేసిన సుప్రీంకోర్టు అన్ని పిటిషన్లపై విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేసింది.

ఇదీ అసలు నేపథ్యం : తమ పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి(గద్వాల), అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), ఎం.సంజయ్(జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బాన్సువాడ), కాలె యాదయ్య(చేవెళ్ల), తెల్లం వెంకట్రావు(భద్రాచలం), కడియం శ్రీహరి(స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్(ఖైరతాబాద్), ప్రకాశ్‌గౌడ్(రాజేంద్రనగర్)లు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

స్పీకర్కు వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేలు : ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారించిన సుప్రీంకోర్టు పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి 3 నెలలు, తర్వాత మరో 4 వారాల సమయాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో న్యాయనిపుణులు, అడ్వకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది శాసన సభ్యులకు నోటీసులు జారీ చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతి ప్రసాద్ కుమార్కు సమర్పించారు.

అభివృద్ధి పనుల్లో భాగంగానే కలిశాం : తాము బీఆర్ఎస్ పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని వారు తమ వివరణల్లో పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో భాగంగా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశామని, ఈ సందర్భంగా సీఎం తమను సత్కరించడమే తప్ప తాము పార్టీ కండువా కప్పుకోలేదని వారు అఫిడవిట్ సైతం దాఖలు చేశారు. మరోవైపు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ ఆధారాలను సభాపతికి సమర్పించారు.

మొత్తంగా ఏడుగురు ఎమ్మెల్యేలకు క్లీన్చిట్ : మొదటగా ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండోసారి మరో ఇద్దరికి క్లీన్‌చిట్ ఇచ్చిన ఆయన మరో ఎమ్మెల్యేకు సంబంధించి తీర్పు రిజర్వులో ఉంచారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లపై ఇంకా విచారణ పూర్తి కాలేదు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు చెందిన అనర్హత పిటిషన్లపై విచారణ కొనసాగాల్సి ఉంది.

అనర్హత పిటిషన్లు కొట్టేసిన స్పీకర్ : నోటీసులు ఇచ్చిన తర్వాత నెలల సమయం తీసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్‌కు తన సమాధానాన్ని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దీంతో నోటీసులు స్వీకరించిన వారిలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరే సమాధానం ఇవ్వనట్లుగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీలపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన సంగతి తెలిసిందే.

ఫిర్యాదులు, రికార్డుల్లో ఉన్న ఆధారాల పరిశీలన, అలాగే సంబంధిత అన్ని పక్షాలకు సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా పూర్తి వాదనలు వినే అవకాశం కల్పించిన అనంతరం స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించారు. పదో షెడ్యూల్‌లోని పేరా 6 ప్రకారం ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ తెలంగాణ శాసనసభ(పార్టీ మార్పు కారణంగా అనర్హత) నియమాలు–1986 ఆధారంగా స్పీకర్ ఈ తీర్పునిచ్చారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు

మొదటి పేజీ రువాయి

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉత్తర–పశ్చిమ ప్రాంతంలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. భోపాలపట్నం–ఫర్సేగఢ్ సరిహద్దుల్లోని అటవీ, కొండ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ ఇంచార్జ్ డీవీసీఎం దిలీప్ బెండ్జా సహా మొత్తం ఆరు మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.మావోయిస్టుల కదలికలపై అందిన నమ్మకమైన సమాచారంతో డీఆర్‌జీ బీజాపూర్, డీఆర్‌జీ దంతేవాడ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు (202, 206, 210 బెటాలియన్లు), సీఆర్‌పీఎఫ్ 214 బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాలు ఈనెల 17న ప్రత్యేక సర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో జనవరి 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి.మృతులను దిలీప్ బెంజా (రివార్డు రూ.8 లక్షలు), మాధవి కోసా (రూ.5 లక్షలు), పాలో పోడియం (రూ.5 లక్షలు), లఖీ మద్కం (రూ.5 లక్షలు), జుగ్లో బంజం (రూ.2 లక్షలు), రాధా మెట్ట (రూ.2 లక్షలు)గా గుర్తించారు. వీరిపై మొత్తం రూ.27 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం తెలిపారు. కీలక నేత దిలీప్ బెంజాపై బీజాపూర్ జిల్లాలో 135 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.ఘటనాస్థలంలో నుంచి రెండు ఏకే–47లు, ఒక ఇన్సాస్, రెండు 0.303 రైఫిళ్లు, ఒక కార్బైన్‌తో పాటు పేలుడు పదార్థాలు, వైర్‌లెస్ సెట్లు, మావోయిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ బెండ్జాపై 135కు పైగా కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

# దూసుకెళ్తున్న సైబర్ మిత్ర


మొదటి పేజీ రువాయి

గంటల తరబడి స్టేషన్లలో పనిలేకుండా, నిమిషాల్లోనే వర్చువల్గా పోలీసులు స్పందిస్తుండటం, ఎఫ్ఐఆర్ కాపీలు నేరుగా మొబైల్‌కే వస్తుండటంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మొబైల్కు ఎఫ్ఐఆర్ కాపీ : సైబర్ నేర బాధితులు 1930 నంబరుకు, జాతీయ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే 'సీ–మిత్ర' బృందం రంగంలోకి దిగుతుంది. బాధితులకు ఫోన్ చేసి పూర్తి వివరాలు ఆరా తీసి, ఏఐ టెక్నాలజీతో లీగల్ అంశాలతో కూడిన పక్కా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి వాట్సాప్ లేదా మెయిల్‌కు పంపిస్తారు. బాధితులు ఆ ఫిర్యాదును ప్రింట్ తీసుకొని, సంతకం చేసి బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు కొరియర్ లేదా పోస్ట్ ద్వారా పంపాలి. ఆ కాపీ అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ వివరాలను బాధితుల మొబైల్‌కే మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు.సీ–మిత్ర సేవలను వేగంగా బాధితులకు అందించేందుకు 24 మందితో కూడిన ప్రత్యేక బృందాన్ని సైబర్ క్రైం విభాగం ఏర్పాటు చేసింది. రెండు షిఫ్టో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ 'వర్చువల్ హెల్ప్‌డెస్క్' బాధితులకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ నేర బాధితులకు ఇబ్బందులు కలగకుండా సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమం సీ–మిత్రను జనవరి 9 వ తేదీన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రారంభించారు.మంచి స్పందన వస్తోంది : టెక్నాలజీని, మానవతా దృక్పథాన్ని జోడించి హైదరాబాద్ పోలీస్ సృష్టిస్తున్న ఈ డిజిటల్ విప్లవంలో ప్రజలకు ఇంత వేగంగా సేవలందిస్తున్నందుకు తమకు చాలా గర్వంగా ఉందని మహిళా కానిస్టేబుల్ పృథ్వీక తెలిపారు. గతంలో సైబర్ మోసం జరిగితే ఫిర్యాదు ఎలా రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అని తెలియక బాధితులు సతమతమయ్యేవారని చెప్పారు. కానీ సీ–మిత్రతో ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవని పేర్కొన్నారు. బాధితుల నుంచి మంచి స్పందన వస్తోందని, ఫోన్ చేసి వివరాలు అడగానే సానుకూలంగా స్పందించి అన్ని వివరాలు తెలియజేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో హైదరాబాద్లో ఒక్క సైబర్ బాధితుడు కూడా లేకుండా చేసి సీ–మిత్ర బంద్ అయ్యే విధంగా తామంతా పనిచేస్తున్నామని తెలిపారు.

# మియాపూర్ లో ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు..

## పాల్గొన్న ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , టీం సభ్యులు..

**తెలుగుజ్యోతి న్యూస్, మియాపూర్ జనవరి 19:** తెలుగు వారి గుండె చప్పుడు, విశ్వవిఖ్యాతనటసార్వభౌముడు, పద్మశ్రీ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మియాపూర్ హైటెన్షన్ లైన్ రోడ్ లో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి ప్రియతమ నాయకుడు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తో పాటు హైదర్ నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ రావు మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మియాపూర్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు ల తో కలిసి పాల్గొన్న సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్, లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహం కి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్,



మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ కె చౌదరి, దొప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్టు,కవి మోటూరి నారాయణరావుకు కర్ణాటక, తెలుగు రైటర్స్ ఫెడరేషన్ లిటరరీ అవార్డు

~~తెలుగుజ్యోతి న్యూస్శేరిలింగంపల్లి,జనవరి 19~~

శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు,, తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి కవి, సీనియర్ జర్నలిస్టు మోటూరి నారాయణరావును కర్ణాటక కు చెందిన సంక్రాంతి లిటరరీ అవార్డ్ వరించింది.కర్ణాటక తెలుగు రైటర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు లోని ఇండో ఏషియన్ అకాడమీ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి లిటరరీ అవార్డ్స 2026 కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా దక్షిణాది భాషా పండితులు,కవులు,రచయితలు హాజరైన మల్టీ లింగ్వల్ పోయిట్ మీట్ కు కవి మోటూరి నారాయణరావు హాజరయ్యారు.. ఖు=ఖీ అధ్యక్షులు మాల్యాద్రి నిర్వాహణా సారథ్యంలో బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, అస్సాం, కర్ణాటక,కేరళ వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కవుల సమక్షంలో. మోటూరి నారాయణరావు లిటరరీ అవార్డ్ 2026 ను అందుకున్నారు. ఈ సందర్భంగా కవి, సీనియర్ జర్నలిస్టు మోటూరి నారాయణరావును మాట్లాడుతూ.. అజంతా భాషగా అలరారే అందమైన తెలుగు భాష ను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాతృభాష అస్థిత్వాన్ని కోల్పోతే తెలుగు ఉనికి ప్రశ్నార్థకమవుతుందని వాపోయారు. పరభాషా వ్యామోహంలో పడి అమ్మ భాషను విడనాడటం మంచిది కాదన్నారు. తెలుగు భాషాభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. తెలుగు భాషాభిమానులను ఒక వేదికపైకి తీసుకువచ్చి సాహిత్యాభ్యున్నతికి కృషి చేస్తున్న కర్ణాటక తెలుగు రైటర్స్



ఫెడరేషన్ సేవలను కొనియాడారు. సంక్రాంతి లిటరరీ అవార్డ్ అందించిన కార్య నిర్వాహక బృందానికి తెలుగు వెలుగు సాహిత్య వేదిక తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# జె.పి నగర్ లో ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు.. పాల్గొన్న ప్రముఖులు..

**తెలుగుజ్యోతి న్యూస్, శేరిలింగంపల్లి జనవరి 19:** తెలుగు వారి ఆరాధ్య దైవం, కారణ జన్ముడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, పద్మశ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30 వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని జెపి నగర్ లో గల నందమూరి తారక రామారావు విగ్రహానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావిపాటి వెంకటేశ్వరరావు , జెపి నగర్ అధ్యక్షులు మోహన్ రావు , ఈశ్వర్ , దొప్పలపూడి రవి కృష్ణ , నాయుడు, అప్పారావు, శేషగిరి రావు, మరియు మియాపూర్ సీనియర్ నాయకులు, మహిళా



నాయకురాలతో కలిసి పాల్గొన్న సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ లయన్ డి.ఎస్.ఆర్.కె ప్రసాద్ లు కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ , మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎం ఆర్ కె చౌదరి, దొప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్దబాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 67 దరఖాస్తులు

**తెలుగుజ్యోతి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, జనవరి 19, :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి డిఆర్ఓ (67) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల



పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని డిఆర్ఓ అన్నారు. వివిధ శాఖలకు సంబంధించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్ ఉన్న శాఖల వారు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల



కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు డిఆర్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మొక్క దేశానికి " శ్రీరామరక్ష "

**గోల్డెన్ యూత్ దూసి "ఆర్ ఎస్ " ఆధ్వర్యంలో**

తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం : పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఆమదాలవలస మండలం దూసి గ్రామంలో గోల్డెన్ యూత్ దూసి ఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "పిల్లలతో మొక్కలు నాటిద్దాం కార్యక్రమం ఘనంగా జరిగింది. అలాగే ప్లాస్టిక్ రహిత, పచ్చదనంతో కూడిన దూసి ఆర్ఎస్ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒక స్కూల్ పిల్లవాడు ఒక గోల్డెన్ యూత్ సభ్యుడు కలిసి మొక్కలు నాటి, పిల్లల్లో పర్యావరణంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎం. రాజశేఖర్ (జనసేన పార్టీ) మాట్లాడుతూ, "పిల్లల నుంచే ప్రకృతి మీద ప్రేమ మొదలైతే భవిష్యత్తు తప్పకుండా హరితమవుతుంది. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామంలో జరగాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, దూసి ఆర్ఎస్ గ్రామాన్ని పచ్చదనం వైపు నడిపించే దిశగా మరో దృఢమైన అడుగు వేశారు.ఈ కార్యక్రమానికి మొక్కలు గోల్డెన్ యూత్ సభ్యుడు అయిన సిగిలిపల్లి భవాని ప్రసాద్ (సాయి ) తండ్రి అయిన స్వర్గీయ శ్రీ సిగిలిపల్లి భాస్కర రావు స్మృతిలో స్పాన్సర్ చేయడం జరిగింది.ఈ మొక్కల నాటే కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతం కావడంలో సహకరించిన గోల్డెన్ యూత్ సభ్యులు మరియు పిల్లలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



# ముక్కాముల బేబీ సరోజిని దశదిన ఖర్మ కార్యా క్రమంలో పాల్గొన్న ప్రముఖులు..



**తెలుగుజ్యోతి న్యూస్, శేరిలింగంపల్లి జనవరి 19:** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని ముక్కాముల బేబీ సరోజిని ఇటీవల నిర్యాణం చెందారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ ఎస్టేట్ లో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికిశేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ , బాలింగ్ యాదగిరి గౌడ్, మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు యలమంచి ఉదయ్ కిరణ్ ,వెంకటేశ్వరరావు, మహేందర్ ముదిరాజ్ , నాని, వంశీ, గోకినేపల్లి రమేష్, వినోద్, వినయ్ తదితరులు, అలాగే కుటుంబ సభ్యులు బాబ్జీ , వల్లభనేని సత్యనారాయణ , సుధీర్ బాబు కలిసి మియాపూర్ ఎస్ఆర్ ఎస్టేట్స్ ను సందర్శించి, పటానికి నివాళులు అర్పించారు.శోకతప్త కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అండగా నిలిచారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం, శాంతి, మనోబలాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.ముక్కాముల బేబీ సరోజిని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# శ్రీరాంపురం, కత్తివరంలో పశువైద్య శిబిరం సేవలు



**తెలుగు జ్యోతి న్యూస్ కంచిలి మండలం :** కంచిలి మండలం శ్రీరాంపురం, కత్తివరం గ్రామాల్లో పశువైద్య శిబిరాలను మండల పశు వైద్యాధికారిని టీ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పలువురు రైతుల పశువులకు వైద్యులు చికిత్స అందించారు. 45 ఆవుదూడలకు ఏలికపాము మందులు, 10 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స మందులు, 25 పశువులకు సాధారణ చికిత్స మందులు అందజేశారు. అనంతరం పశు వైద్యాధికారిని టీ శిరీష మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పశు వైద్య శిబిరం సేవలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

# విజేతగా నిలిచిన మకరాంపురం జట్టు



**తెలుగు జ్యోతి న్యూస్ కంచిలి మండలం :** కంచిలి మండలం కత్తివరంలో జక్కర యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా సోమవారం ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఇందులో భాగంగా మకరాంపురం, ఆర్ బెలగాం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. మకరాంపురం జట్టు విజేతగా నిలవగా.. ఆర్ బెలగాం జట్టు రన్నర్స్ గా నిలిచింది. ఈ కార్యక్రమంలో కంచిలి జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణరావు, కేసరిపడ సర్పంచ్ యుగంధర్, ఎస్ఆర్సీ పురం సర్పంచ్ డొక్కరి బలరాం, జిల్లా క్రికెట్ బోర్డు సభ్యుడు టీవీ రమణ, రత్నాల సారథి చౌదరి, శోభన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేయాలి :

## డాక్టర్ గోగుల్ రాణా ప్రతాప్ రెడ్డి



**తెలుగు జ్యోతి న్యూస్, వరంగల్,నర్సంపేట, జనవరి 19, ప్రతినిధి వంశీ హంస**

నర్సంపేట నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో డాక్టర్ గోగుల్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ...అవినీతి పాలన చేసిన దీ=ా, దౌర్జన్యాలకు పాల్పడిన కాంగ్రెస్‌ను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలి. 420 హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌పై ప్రజలు విసుగు చెందారు. బీజేపీకి అందరూ ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా వున్నారని పేర్కొన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో 30 వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచి కాషాయ జెండాను ఎగరేయాలని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. నర్సంపేట ఎన్నికల వ్యూహాలు,అభ్యర్థుల బూతులను పటిష్టంగా చేసుకొని, గడప గడపకు మోడీజీ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశం చేశారు. భారాస,కాంగ్రెస్ అవినీతి వ్యవహారాలను బహిర్గతం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహారాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, సీనియర్ నాయకులు కూనమళ్ళ పృధ్వీరాజ్, జూలూరి మనీష్ గౌడ్, శీలం సత్యనారాయణ, బాల్నే జగన్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిళ్ళ రామచందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలల్లో పాల్గొన్న ప్రజా నాయకులు

**తెలుగుజ్యోతి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యూరో, జనవరి 19, :**

మేడ్చల్ నియోజకవర్గం పరిధిలో రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మూడుచింతలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మార్వో కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా ఎమ్మెల్సీ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, టిపిసిసి అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... నూతన ఎమ్మార్వో కార్యాలయం ప్రారంభంతో ప్రజలకు భూ సంబంధిత సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలనా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం అలియాబాద్ మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కోట్ల రూపాయల నిధులు మంజూరు కావడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. అభివృద్ధి పనుల వివరాలు: అలియాబాద్ సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఇతర అభివృద్ధి పనులకు రూ,4 కోట్లు 83.50 లక్షలు, తుర్కపల్లిలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఇతర అభివృద్ధి పనులకు రూ,1 కోటి 53.10 లక్షలు, మురహరిపల్లిలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఇతర అభివృద్ధి పనులకు రూ,1 కోటి 55.20 లక్షలు, మజీద్ పూర్ శ్రీశీ సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఇతర అభివృద్ధి పనులకు రూ,3 కోట్లు 9.80 లక్షలు, యాడారంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఇతర అభివృద్ధి పనులకు రూ,78.90 లక్షలు, లాల్ గడి మలక్‌పేట్ సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, ఇతర అభివృద్ధి పనులకు రూ,3 కోట్లు 19.50 లక్షలు, తుర్కపల్లి అదనంగా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు రూ,16.60 లక్షలతో పలు అభివృద్ధి పనులు పనులు



చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అలియాబాద్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఇంద్రమ్మ శ్రీ శక్తి సంఘాల 18506 మంది మహిళలకు ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి చీరల పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా అలియాబాదులో 5258, ఎంసీ పల్లిలో 6592, ఎల్లంపల్లిలో 6656 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసారు. గతంలో అలియాబాద్ మున్సిపల్ పరిధి మహిళలకు రెండు కోట్ల 33 లక్షల వడ్డీ లేని రుణాలను అందించామని, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రానున్న మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు తమకు అందిస్తున్న రిజర్వేషన్ కోటాలో పోటీ చేసి రాజకీయ పదవులను కూడా అధిష్టించాలని ఆకాంక్షించారు. అలాగే, మేడ్చెల్ జిల్లాలో రూ. 45 లక్షల నిధులతో 900 మంది మైనారిటీ నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసామని, మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేదలు, మైనార్టీలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 40 కోట్ల నిధులతో మూడు మున్సిపాలిటీలలో ఎల్లంపేట మున్సిపాలిటీలో 9 కోట్ల 43 లక్షల నిధులతో, అలియాబాద్ లో 15 కోట్ల నిధులతో, మూడుచింతలపల్లిలో 15 కోట్ల నిధులతో శంకుస్థాపనలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ నిర్మించిన మూడుచింతలపల్లి ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయ నూతన భవనాన్ని, మేడ్చల్ మండల తాసిల్దార్, జాయింట్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలను కూడా ప్రభుత్వ చీఫ్ విప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎ బ్లాక్ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, గోన మహేందర్ రెడ్డి, జెడ్పి మాజీ చైర్మన్ శరత్ చంద్రా రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, ఆర్టీఏ మెంబెర్ భీమిడి జైపాల్ రెడ్డి, గ్రంథాలయం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎ బ్లాక్ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, గోన మహేందర్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్ డి ఓ రాజేష్, డిప్యూటీ కలెక్టర్ మోక్షిత, మూడు చింతలపల్లి ఎం ఆర్ ఓ ఇద్రీస్ మేడ్చల్ ఎం ఆర్ ఓ భూపాల్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, జిల్లా డి ఆర్ డి ఓ సాంబశివరావు, సంబంధిత మున్సిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.



# జొన్నలను రోజూ తినడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..?



తృణ ధాన్యాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. మనం ఆహారంగా తీసుకునే తృణ ధాన్యాల్లో జొన్నలు కూడా ఒకటి. జొన్నలను ప్రపంచవ్యాప్తంగా 5వేల సంవత్సరాలకు పైగా సాగు చేస్తున్నారు. వీటిని జొవార్ అని కూడా పిలుస్తారు. పూర్వకాలంలో జొన్నలు ప్రధాన ఆహారంగా ఉండేవి. జొన్నలకు ఉన్న ప్రాధాన్యతను, వాటి పోషక విలువలను, వాటి ప్రయోజనాలను తెలుసుకున్న ఈ తరం వారు ఆధునిక వంటకాల్లో కూడా జొన్నలను ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. అద్భుతమైన పోషకాలు, బహుళ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న కారణంగా జొన్నలు సూపర్ ఫుడ్ గా ప్రజాదారణ పొందాయని చెప్పవచ్చు. జొన్నలను ఆహారంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్యప్రయోజనాలను పొందవచ్చు. జొన్నలను తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

అధికంగా ఐరన్..

జొన్నలు అధిక కరువును తట్టుకుంటాయి. జొన్నలు ఇతర ధాన్యాల కంటే దాదాపు 30 శాతం తక్కువ నీటిని ఉపయోగించుకుంటాయి. అలాగే ఐరన్ లోపాన్ని తగ్గించడంలో జొన్నలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. జొన్నల్లో ఇతర ధాన్యాల కంటే అధిక మొత్తంలో ఐరన్ ఉంటుంది. ఉడికించిన జొన్నల్లో 100గ్రాములకు గాను 2.25 మి.గ్రా. నుండి 4.4 మి.గ్రా మధ్య ఐరన్ ఉంటుంది. జొన్నలను తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది. అంతేకాకుండా జొన్నల్లో ఇతర చిరుధాన్యాల కంటే ఫినోలిక్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. లుటియోలినిడిన్, అపిజెనినిడిన్ వంటి ప్రత్యేకమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న ఆహారాల్లో జొన్నలు ఒకటి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాపు, ఆక్సీకరణ ఒత్తిడిని ఎదుర్కోవడంలో సహాయపడతాయి.

కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

జొన్నలను తీసుకోవడం వల్ల స్థిరమైన శక్తిస్థాయిలు అందుతాయి. శరీర జీవక్రియ మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు పేగుల ఆరోగ్యం పెరుగుతుంది. జొన్నలు సహజంగానే గ్లూటెన్ రహిత ఆహారాలు. కనుక వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా జొన్నలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. జొన్నల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల మలబద్దకం సమస్య తగ్గుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా జొన్నలు మనకు దోహదపడతాయి. జొన్నలను తీసుకోవడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. ఈ విధంగా జొన్నలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. జొన్న రొట్టెలను, జొన్న అన్నాన్ని, జొన్న ఉప్మా, జొన్న ఇడ్లీ వంటి వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల జొన్న వల్ల కలిగే ప్రయోజనాలను మనం పొందవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# మీరంటున్న తప్పుడు జీవో నిధులతోనే ప్రస్తుత అభివృద్ధి పనులు : దేవోజు తిరుమల సదానందం



**తెలుగు జ్యోతి న్యూస్, వరంగల్,నర్సంపేట,జనవరి 19,ప్రతినిధి వంశీ హంస**

కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెండం రామానంద్ మాట్లాడిన వాక్యాలు సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని,18వ వార్డు మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారు గతంలో తెచ్చిన నిధులతోనే నర్సంపేట పట్టణం అభివృద్ధి సాధ్యమైందని, కాంగ్రెస్ నేతలు 'తప్పుడు జీవోలు' అని పేర్కొన్న వాటిని దైవసాక్షిగా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తిరుమల సదానందం సవాలు విసిరారు. ఎవరు ఎవరిని తరిమికొడతారో ప్రజలు నిర్ణయిస్తారని అన్నారు. పెండం రామానంద్ చేసిన ఆరోపణలు తెలంగాణ ఉద్యమ నేత, మాజీ శాసనసభ్యుడు పెద్ది సుదర్శన్ రెడ్డిని కించపరిచేలా ఉన్నాయని, ఇది సామాన్య ప్రజల్లో ఆలోచన కలిగిస్తుందని సదానందం అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గారు గతంలో తెచ్చిన నిధుల జీవోలు 'చిత్తు కాగితాలు' అని కాంగ్రెస్ నేతలు చెప్పారు కదా..!? అని ప్రశ్నించారు. మాజీ కౌన్సిలర్ పెండం లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ బత్తిని రాజేందర్, వేముల సాంబయ్య, ఓర్సు అంజలి, ఏలుకంటి విజయ్, ముల్కల వినోద్ వారిని అడిగి చూడమని పలు సూచనలు చేసారు. ఆనాటి మున్సిపల్ తీర్మానాల్లో చిత్తు కాగితాలపైనే సంతకాలు పెట్టారని, ఆ నిధులతోనే ఈరోజు సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారని గుర్తు చేయడం జరిగింది. గత రెండేళ్లుగా ఆ పనులను ఆపి,మున్సిపల్ ఎన్నికల సమయంలో తమ కాంట్రాక్టర్ల పేరిట టెండర్లు వేసుకుని పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఆ చిత్తు కాగితాలు నిజంగా అలాంటివేనా? నిరూపించగలరా? అని సవాలు విసిరారు. మా పార్టీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు వస్తాం... మీరు కూడా రండి. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం లేదా మీ ఇంటి వెనుక హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమేనా..? అని, పెద్ది సుదర్శన్ రెడ్డి మీద తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.




Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223